డీఎంహెచ్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

రెమ్యూనరేషన్ డబ్బులు చెల్లించాలి

నాగర్‌కర్నూల్, మే 16: ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల డ్యూటీలో పాల్గొన్న ఆశ కార్యకర్తలకు రెమ్యూనరేషన్ డబ్బులు చెల్లించాలని గురువారం ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో, ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో విధుల్లో పాల్గొన్న వివిధ రకాల అధికారులకు డబ్బులు చెల్లించిన ప్రభుత్వం ఆశ, అంగన్‌వాడీ, మున్సిపల్ వర్కర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రెమ్యూనరేషన్ ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వెంటనే రెమ్యూనరేషన్ ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య, జిల్లా కోశాధికారి గుంపల్లి అశోక్, శ్రీదేవి, శివలీల, కృష్ణవేణి, భాగ్యమ్మ, అలివేల, వసుంధర, వరలక్ష్మి, గౌరమ్మ, లక్ష్మి, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

నూతనంగా వేసిన నారాయణపూర్‌తండా బీటీ పగిలిపోయిన దృశ్యం

వెల్దండ, మే 16 : మండలంలోని నారాయణపూర్ గ్రామానికి ఇటీవల వేసిన బీటీ రోడ్డు పూర్తిగా నాసిరకంగా ఉందని గ్రామస్తులు ఆరోపించారు. హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి నుంచి నారాయణపూర్ తండా వరకు 3 కిలోమీటర్ల మేర గత ప్రభుత్వం జీడీఎఫ్ పథకంలో రూ.1.23కోట్లు నిధులు మంజూరు చేసింది. దీంతో గుత్తేదారు రోడ్డు నిర్మించారు. కాగా బీటీ రోడ్డు పలుచగా నాసిరంగా నిర్మించారని గ్రామస్తులు ఆరోపిస్తూ సోషల్‌మీడియా ద్వారా వైరల్ చేశారు. నిర్మించిన ఐదు నెలలకే పూర్తి పగిలిపోతుందని, నాసిరకంగా నిర్మించిన గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని వారు అధికారులను డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

దెబ్బతిన్న బీటీ రోడ్డు

తాడూరు, మే 16 : మండలంలోని చర్ల తిరుమలాపూర్ నుంచి ఎండబెట్లకు వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు వద్ద బీటీరోడ్డు దెబ్బతినడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం రూ. కోట్లు ఖర్చు చేసి రోడ్లు వేస్తుంటే కాంట్రాక్టర్లు నాసిరకంగా పనులు చేపట్టడంతో వేసిన కొన్నాళ్లకే రోడ్లు దెబ్బతింటున్నాయంటున్నారు. రోడ్డు దెబ్బతిన డంతో వాహనాలు అదుపు తప్పి పడిపోయిన ఘటనలు ఉన్నాయంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దెబ్బతిన్న బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్లతిరుమలాపూర్ –ఎండబెట్ల మధ్య దెబ్బతిన్న బీటీ

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

ఊర్కొండ : డాక్టరేట్ అందుకుంటున్న విజయ్‌కుమార్ గౌడ్

కొల్లాపూర్ రూరల్, మే 16 : పట్టణంలోని పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో ఎంబీఏ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష ఈనెల 10వ తేదీన ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టర్‌రేట్ అందుకున్నట్లు గురువారం ప్రకటనలో తెలిపారు. ఏ స్టడీ ఆన్ క్రెడిట్ స్కీమ్స్ ఆఫర్డ్ బై కమర్షియల్ బ్యాంక్ అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినందుకు గౌరవ డాక్టర్‌రేట్ అందుకున్నట్లు తెలిపారు. డాక్టరేట్ అందుకున్న ప్రొఫెసర్ శిరీషను పీజీ కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

శిరీష

మూరు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వనపర్తి పీజీ కళాశాలలో మైక్రో బయోలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న విజయ్‌కుమార్ గౌడ్ పీయూ ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి పర్యవేక్షణలో రెమిడియేషన్ స్టడీస్ ఆఫ్ ఫిజికో కెమికల్, మైక్రో బయోలాజికల్ అనాలసీస్ అప్ వాటర్ ఫర్ రిస్టోరేషన్‌పై చేసిన పరిశోధనకు గాను పాలమూరు విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. దీంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించి సన్మానించారు.

నర్సంపల్లి వాసికి డాక్టరేట్

ఊర్కొండ, మే16: మండలంలోని నర్సంపల్లికి చెందిన విజయ్‌కుమార్ గౌడ్ గురువారం మైక్రోబయోలజీ లో పాల

నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోవాలి

నాగర్‌కర్నూల్/అచ్చంపేటరూరల్, మే 16 : 2024–25 విద్యా సంవత్సరానికి గానూ గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఎస్టీ అభ్యర్థులు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కోసం నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖాధికారి కమలాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. మాస్టర్ పీహెచ్‌డీ, రీసెర్చ్ ప్రోగ్రాం కోసం విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఈ స్కాలర్‌షిప్ అందిస్తుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా ఈపోర్టల్‌లో tribal.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మృతిచెందిన రాము

కల్వకుర్తి, మే 16 : కల్వకుర్తి పట్టణం నాగర్‌కర్నూల్ రోడ్డులో ఓ వైన్స్ దుకాణం సమీపంలో గురువారం రాత్రి విద్యుదాఘాతానికి గురై రాము(22) మృతిచెందాడు. స్థానికులు కథనం మేరకు కల్వకుర్తి పట్టణం ఇందిరానగర్ కాలనీకి చెందిన రాము కిరాణ దుకాణంలో పని చేసుకుంటు జీవ సంసాగిస్తున్నాడు. గురువారం సాయం త్రం నుంచి వర్షం కురిసిన నేపథ్యంలో వర్షం వెలియగానే రాము వైన్స్ సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం వద్దకు మోటర్ సైకిల్‌పై వచ్చాడు. వచ్చిన వెంటనే పడిపోయాడు. విద్యుత్ షాక్‌కు గురై చనిపోయాడని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటణ స్థలం వద్దకు చేరుకొని రాము మృతదేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రిలోకి మార్చురికి తరలించారు. ఇదే విషయమై ఎస్సైని వివరణ అడిగితే తమకు ఇంకా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

డెంగీని తరిమికొట్టాలి

- జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్
- గ్రామాల్లో ఆశ కార్యకర్తల అవగాహన ర్యాలీలు

నాగర్‌కర్నూల్ : ర్యాలీ ప్రారంభిస్తున్న సుధాకర్‌లాల్

నాగర్‌కర్నూల్, మే 16 : దోమలను నివారించి డెంగీని అరికట్టాలని, డెంగీ వ్యాధి నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ అన్నారు. గురువారం జాతీయ డెంగీ నిర్మూలన దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగీ వ్యాధి నివారణ కోసం గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అవగాహన కార్యక్రమా లు చేపడుతున్నామన్నారు. దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడితేనే డెంగీ నివారణ సాధ్యమవుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో చెత్త, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి జ్వర లక్షణాలుంటే టీ హబ్ ద్వారా ఉచితంగా నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నామన్నారు. డెంగీ చికిత్సకు అన్ని దవాఖానల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, డాక్టర్ నారాయణస్వామి, అసిస్టెంట్ మలేరియా అధికారి శ్రీనివాసలు, కేశవులు, నిరంజన్, రమేశ్ రెడ్డి, కుమార్, కళ్యాణ్, సురేశ్, రాజవర్ధన్‌రెడ్డి, గిరి, వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేటటౌన్, మే 16 : దోమలను నివారించి డెంగీ వ్యాధి అరికట్టాలని ప్రొగ్రాం అధికారి అశోక్ ప్రసాద్ అన్నారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డెంగీ లక్షణాలుంటే దగ్గర లో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలని సూచించారు. అనంతరం పట్టణ పుర వీధుల గుండా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుగుణాబాయి, కమల, శాంత, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ఉన్నారు.

అచ్చంపేటటౌన్ : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాష్ట్రంలో అరాచక పాలన

వంగూరు, మే 16 : రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన సాగిస్తుందని సర్పంచుల సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఆంజనేయులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల రోజున మండలంలోని కోనేటిపూర్‌లో ఇరువర్గాలు ఘర్షణ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై కేసు నమోదు చేయడమే కాకుండా మండల నాయకుడిని స్టేషన్‌లో నిర్బంధించి కొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. అదే సమయంలో తీవ్ర గాయాల భారిన పడిన బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోవడం చూస్తుంటే కాంగ్రెస్ కుటిల రాజకీయాలకు పాల్పడుతుందనే భావన కలుగుతుందన్నారు. ఇలాగే కొనసాగితే ప్రజల తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు.

అసత్య ఆరోపణలు సరికాదు

అచ్చంపేట, మేఏ 16: ఎమ్మెల్యే వంశీ కృష్ణపై అసత్య ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్, రవికుమార్, చింతల శ్యాం అన్నారు. గురువారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సాయి నగర్‌లో జరిగిన ఘర్షణకు ఎమ్మెల్యే కు సంబంధం లేదన్నారు. సమావేశంలో నాయకులు రాజు, ప్రేమ్ పాల్గొన్నారు.

కల్వకుర్తి పోస్టాఫీసుకు కష్టమొచ్చింది

సిబ్బంది లేక వెలవెల బోతున్న కౌంటర్లు

కల్వకుర్తి, మే 16 : కల్వకుర్తిలో పనిచేస్తున్న పోస్టుమాస్టర్ ఐదారు రోజుల సెలవుపై వెళ్లాడు. వనపర్తి పోస్టు కార్యాలయ సూపరింటెండెంట్ ఆదేశానుసారం వంగూర్‌కు చెందిన పోస్టుమాస్టర్‌ను కల్వకుర్తి పోస్టాఫీసుకు డిప్యూటేషన్‌పై పంపించారు. కల్వకుర్తి పరిధిలో దాదాపు 14 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. ఈ బ్రాంచి పోస్టాఫీసులకు డబ్బు కల్వకుర్తి పోస్టాఫీసు నుంచే అందుతుంది. కల్వకుర్తి పోస్టాఫీసుకు జడ్చర్ల పోస్టాఫీసు నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఈక్రమంలో గురువారం కల్వకుర్తి పోస్టుమాస్టర్ డబ్బుల కోసం జడ్చర్ల పోస్టాఫీసుకు వెళ్లాడు. ఉదయం వెళ్లిన పోస్టుమాస్టర్ మధ్యాహ్నం 3 గంటలకు కల్వకుర్తికి వచ్చాడు. విషయం తెలియని ఖాతాదారులు పోస్టాఫీసు వద్ద ఎదురుచూసి వెళ్లిపోయారు. ఒక్క పోస్టుమాస్టర్ లేకుంటే కార్యాలయంలో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గతంలో కల్వకుర్తి పోస్టాఫీసుకు చెందిన డబ్బులు స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో ఉంచేవారు. అవసరానుసారం డబ్బులు తీసుకోవడం లేదా, డిపాజిట్‌లను బ్యాంకులో చేసేవారు. ప్రస్తుతం ఆ పద్ధతిని ఉన్నతాధికారులు తొలగించారు. జడ్చర్ల పోస్టాఫీసు అధికారులు ప్రత్యేక వాహనంలో వచ్చి డబ్బులు ఇచ్చేవారు, తీసుకెళ్లేవారు. తర్వాత ఆ పద్ధతిని కూడా తొలగించారు. డబ్బులు డిపాజిట్ చేయాలన్నా.. తీసుకోవాలన్నా జడ్చర్లకు వెళ్లాల్సిందే. జడ్చర్ల పోస్టాఫీసుకు వెళ్లి తమకు ఎంత డబ్బు అవసరం ఉందో ఇండెంట్ పెడితే.. అప్పుడు వారు బ్యాంకుకు వెళ్లి డబ్బులు డ్రా చేసి తీసుకొచ్చి పోస్టుమాస్టర్‌కు ఇస్తారు. డబ్బులతో బస్సుల్లో లేదా ఇతర వాహనాల్లో కల్వకుర్తికి రావాలి. సీసీఐ ఆధ్వర్యంలో రైతుల నుంచి కొనుగోలు పత్తికి సంబంధించిన డబ్బులు కూడా పోస్టాఫీసు ఖాతాల్లో జమచేస్తుండడంతో.. కోట్ల రూపాయాలను కూడా భద్రత లేకుండా బస్సుల్లో లేదా మరేదైన వాహనంలో తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. పోస్టాఫీసులను బలోపేతం చేసేందుకు సిబ్బంది నియామకాలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మండల సమావేశం వాయిదా

బిజినేపల్లి, మే 16 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో కతాలప్ప తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావాల్సిన సభకు 11:30 వరకు ప్రాదేశిక సభ్యులు హాజరు కాకపోవడంతో సభను వాయిదావేసినట్లు తెలిపారు. తిరిగి సభ నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

టీజీ వెంకటేశ్‌కు సన్మానం

వెల్దండ, మే 15 : మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను వెల్దండ మండలానికి చెందిన ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కర్నూల్‌లోని ఆయన స్వగృహంలో టీజీ వెంకటేశ్‌ను కలిసిన రామకృష్ణ పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం మాజీ మండలాధ్యక్షుడు ఆంజనేయులు ఉన్నారు.

పశుగ్రాసం, పైపులు దగ్ధం

వెల్దండ, మే 16 : మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన కృష్ణయ్యకు చెందిన వ్యవసాయ పొలంలో ని ప్పంటుకున్నది. దీంతో పొలంలో ఉన్న వరిగడ్డి పూర్తిగా కాలి బూడిదయ్యింది. అదేవిధంగా పంట చేను నీటి పైపులు కాలిపోయాయని రైతు కృష్ణయ్య వాపోయాడు. నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉరుములతో కూడిన వర్షం

మల్దకల్, మే 16: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో రైతులు దుక్కి దున్నడం మొదలు పెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఇలాగే మరో వర్షం కురిస్తే సీడు విత్తనాలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

వాయిదా పడిన బీడీ కార్మికుల చర్చలు

అమరచింత, మే 16: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న బీడీ కార్మికుల కూలీ రేట్లు పెంపునకు సంబంధించి గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో యాజమానులతో కార్మిక సంఘాల నాయకులు జరిపిన చర్చలు మూడోసారి వాయిదా పడ్డాయని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రెండేండ్ల కిందట బీడీ కార్మికుల కూలీ రేట్లను పెంచిన యాజమానులు మార్చి 31తో ముగియగా.. రెండు నెలల ముందు నుంచే బీడీ కార్మికుల కూలీ రేట్లను పెం చాలని యాజమానలకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నోటీసులు ఇచ్చారు. ఈనెల 25వ తేదీన చర్చలు జరి పేందుకు యాజమానులు సమయం అడిగారని తెలిపారు.

వంతెన పనుల పరిశీలన

అయిజ, మే 16 : పట్టణంలో నిర్మాణంలో ఉన్న హైలెవల్ వంతెన పనులను అయిజ అఖిల పక్ష కమిటీ నాయకులు గురువారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వానకాలం వస్తున్న వేళ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వంతెన అప్రోచ్ రోడ్డు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం చేయొద్దు

- డీఆర్డీవో ఓబులేశ్

జటప్రోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్డీవో ఓబులేశ్

పెంట్లవెల్లి, మే16 : వర్షాలు కురిసే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చే వరి ధాన్యం కొనుగొలులో నిర్లక్ష్యం చేయొద్దని డీఆర్‌డీవో ఓబులేశ్ నిర్వాహకులకు సూచించారు. గురువారం ఆయన మండలంలోని జటప్రోల్, గోప్లాపురంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తెచ్చే ధాన్యాన్ని ఎప్పట్టికప్పుడు కొనుగోలు చేయాలని ఏపీఎం గౌస్‌ను ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో ప్రసన్న కుమారితో కలసి గ్రామంలోని నర్సరీలను పరిశీలించారు. నర్సరీలలో మొక్కలు ఎండిపోకుండా నీరు అందించి సంరక్షించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఈయన వెంట ఏపీవో మోహన్, ఈజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

రాజోళి, మే16: పొలం తగాదాలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామానికి చెందిన మహేశ్ కొన్ని రోజులుగా నందికోట్కూర్ మండలంలో నివసిస్తున్నాడు. ఆయనకు పెద్ద ధన్వాడలో 4ఎకరాల సాగు భూమి ఉండగా దానిని కౌలుకు ఇచ్చేందుకు పూనుకున్నాడు. అయితే మహేశ్ బాబాయి చిన్న శేషిరెడ్డి తన కొడుకులు వీరేశ్, వెంకట్రాముడుతో కలిసి తమకే కౌలుకు ఇవ్వాలని తరచూ గొడవ చేసేవాడు. అయితే ఈనెల 14వతేదీ గ్రామంలో శుభకార్యం ఉండగా గ్రామానికి వచ్చిన మహేశ్‌పై చిన్న శేషిరెడ్డి తన కుమారులతో కలిసి కర్రతో దాడి చే యగా మహేశ్ తలకు బలమైన గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దళితవాడల అభివృద్ధిపై వివక్ష తగదు

అమరచింత, మే 16: దళితవాడల అభివృద్ధిపై మున్సిపల్ పాలకవర్గం, అధికారులు నిర్లక్ష్యం చూపడం తగదని, మూడేండ్ల కిందట చేపట్టిన డ్రైనేజీలకు సంబంధించి ఇప్పటికీ బిల్లులు చేయడంలో నిర్లక్ష్యం చూపడం దళితవాడలపై వివక్ష చూపడమేనని మున్సిపల్ కౌన్సిలర్ లావణ్య, బీజేపీ నేత ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా వారు గురువారం అమరచింత మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ నూరుల్‌నదీమ్‌ను కలిసి రెండో వార్డులో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల నుంచి పనులు చేపట్టి బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. పనులు చేసి ఏండ్లు గడుస్తున్నా గతంలో పని చేసిన అధికారులు సబ్‌ప్లాన్ నిధులను మిగతా అవసరాలకు దారి మళ్లించి తమను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు బిల్లులను చెల్లించి దళితవాడల అభివృద్ధికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రివాల్వర్‌తో కాల్చుకొని కానిస్టేబుల్ ఆత్మహత్య

శివశంకర్‌రెడ్డి (ఫైల్)

శ్రీశైలం, మే 16 : శ్రీశైలం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఆర్థిక ఇబ్బందులు భరించలేక రివాల్వర్‌తో కాల్చుకొని మృతి చెందాడు. ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు కథనం మేరకు.. శ్రీశైలం పీఎస్‌లో కొన్నేళ్లుగా కర్నూల్‌కు చెందిన శివశంకర్ రెడ్డి(46) విధులు నిర్వర్తిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున స్టేషన్ రెస్ట్‌రూంలో ఆయన రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు సమాచారం. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

నేడు డయల్ యువర్ ఆర్ఎం..

పాలమూరు, మే 16: మహబూబ్‌నగర్ ఆర్టీసీ ప్రయాణికులకు శుక్రవారం సాయంత్రం 4నుంచి 5గంటల వరకు డయల్ యువర్ ఆర్ఎం ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు ఆర్.ఎం శ్రీదేవి గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు సెల్ నెంబర్ 9959226295ను సంప్రదించాలని జిల్లా ప్రజలకు సూచించారు.

ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు

- నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ దేవరాజు

ప్రశంసా పత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్

నాగర్‌కర్నూల్‌టౌన్, మే 16 : ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని డిపో మేనేజర్ దేవరాజు డ్రైవర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలోని డిపోలో గురువారం మే నెల అవార్డు ఫంక్షన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బెస్ట్ కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్, కేఎంపీఎల్ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ డిపోజీరో యాక్సిడెంట్ డిపోగా ఉండాలని, ఆన్ డ్యూటీలో మద్యం సేవించరాదని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. రోడ్డుపైన బస్సు ఆపినప్పుడు లెఫ్ట్ సైడ్ ఆపుకోవాలని, వెనకాల వచ్చే వాహనాలకు ఇబ్బంది కాకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి నెల 16వ తేదీన డిపోలో క్యాష్ అవార్డు ఫంక్షన్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్యారేజి ఇన్‌చార్జి భాస్కర్, హెడ్‌గార్డ్ రామకృష్ణ, ఏడీసీలు శ్రీనివాసులు, పరశురాం, బాలస్వామి, యాదయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కల్వకుర్తి, మే 16 : కల్వకుర్తి మండలం మార్చాల సమీపంలో సూర్యలతా కాటన్ మిల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీహరి హైదరాబాద్ ఉస్మానియా దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కల్వకుర్తి మున్సిపాలిటీలోని సంజాపూర్‌కు చెందిన శ్రీహరి ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామానికి వస్తూ బుధవారం రాత్రి సూర్యలతా కాటన్‌మిల్లు వద్ద అదుపు తప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీహరిని కల్వకుర్తి ప్రభుత్వ కమ్యూనిటీ దవాఖానలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. ఉస్మాని యా దవాఖానలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

బాధిత కుటుంబాన్ని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఉస్మానియా దవాఖానలో పరామర్శించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రైవేట్ జూనియర్ కళాశాలపై ఇంటర్‌బోర్డు చర్యలు

- రెండేండ్ల పాటు ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతి రద్దు
- రూ.లక్ష జరిమానా

నాగర్‌కర్నూల్, మే 16: విద్యార్థులతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనివాస పద్మావతి జూనియర్ కళాశాలపై ఇంటర్ బోర్డు చర్యలు తీసుకున్నదని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి వెంకటరమణ గురువారం ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ సమయంలో మాయమాటలు చెప్పి కళాశాలలో అడ్మిషన్ పొందాక అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారని, గతంలో ప్రాక్టికల్ పరీక్షల సమయంలో కళాశాల యాజమాన్యం అక్రమంగా డబ్బులు వసూలు చేసిందని పలువురు విద్యార్థులు నోడల్ అధికారికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

ఇందుకు స్పందించిన ఇంటర్ బోర్డు కళాశాలలో రెండేళ్లపాటు ప్రాక్టికల్ పరీక్షలకు అనుమతి రద్దు చేస్తూ రూ. లక్ష జరిమానా విధించినట్లు నోడల్ అధికారి తెలిపారు.

ఆర్ఎన్ఆర్ క్వింటా రూ.2,481

జడ్చర్ల, మే 16: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం ఆర్ఎన్ఆర్ రకం ధాన్యానికి అత్యధికంగా క్వింటా రూ.2,481ధర పలికింది. మొక్కజొన్న, ఆముదాలు అమ్మకానికి వచ్చాయి. 7,164క్వింటాళ్ల ఆర్ఎర్ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా కనిష్ఠంగా రూ.1,905 మధ్యస్తంగా రూ.2,209 ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 17క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగ